

# చదరంగం

డా॥ ఎ.యం. అయోధ్యారెడ్డి

లౌడ్‌స్పీకర్లోంచి వొస్తున్న పాట పరిసరాలను హోరెత్తిస్తూంది - పడుచు గాయకుడెవరో చీమల మీదా తుమ్మెదల మీదా వంకపెట్టి బూతుగా పాడుతున్నాడు. ఆ పాటలోని బూతును యింకా పైకెగదోస్తూ సంగీతం విశృంఖల విహారం చేస్తోంది. ఫలితంగా కొందరు సంగీతానికి అనుగుణంగా బుర్రలూపితే మరి కొందరు బుర్రలుమాత్రమే కాక భుజాలు కూడా కదిలిస్తున్నారు.

అక్కడి వాతావరణమంతా ఉత్తేజకరంగా ఉన్నది. కార్యనిర్వాహకులంతా హడావిడిగా అటూయిటూ తిరుగుతున్నారు. పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి.

ఇసుకవేస్తే రాలనట్లుగా వున్నారు

*1983 చక్రపాణి అవార్డు కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ*

జనం. మూడురోజ్లూ కలిసే ముఖ్యమైన సెంటరది. అన్నిరోజ్లూ జనంతో క్రిక్కిరిసి పోవటంవల్ల సైకిళ్ళు, రిక్షాలు, కార్లు, బస్సులు ఒకటేమిటి....? అన్ని రకాల వాహనాలూ ఎక్కడివక్కడ నిల్చిపోయాయి. గజాని కొకరు చొప్పున ఎర్రటోపీలు ధరించి, లాఠీలు చేతబట్టి పోలీసులు జనాన్ని కంట్రోలు చెయ్యడానికి తంటాలుపడుతున్నారు.

టైము పదిగంటలు సమీపిస్తున్న కొద్దీ అందరిలోనూ ఆతురత ఎక్కువైంది. మంత్రిగారు ఏ నిముషాన్నయినా రావొచ్చు. ఊళ్ళోవాళ్లంతా ఎన్నాళ్ళుగానో ఎదుర్చూస్తున్న మహాత్మాగాంధీ విగ్రహ ప్రతిష్ఠాపన ఆ రోజున అక్కడ జరగబోతున్నది. ఆ సందర్భంగానే ఆయనక్కడికి వేంచేస్తున్నారు.

సెంటర్ మధ్యలో ఎత్తైన గద్దెమీద నిలబడివున్నారు గాంధీగారు. ఆయన రూపం కన్పించకుండా తెల్లనిగుడ్డ కప్పి వుంచారు. చుట్టూ రంగురంగుల తోరణాలు కట్టేరు. పక్కనే పెద్ద పీటలతో వేదిక తయారుచేసేరు. దానిమీద షామియానా యెత్తేరు. కింద మెత్తటి కార్పెట్లు పరిచేరు.

మంత్రిగారు ఆ నియోజకవర్గంనుండే ఎమ్మెల్యేగా ఎంపికైనవాడు. రెండ్రోజుల క్రితమే జరిగిన మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఆయనకా మంత్రిపదవి లభించింది. ఆయన ప్రమాణస్వీకారం జరిపినతర్వాత ఒప్పుకున్న మొట్టమొదటి ఫంక్షన్ అదే.

వేదికకి వెనకపక్కన బల్లముందు కూర్చుని గ్రామ్‌ఫోనుమీద రికార్డులు మార్చటంలో నిమగ్నమైవున్నాడు ఇన్‌ఫర్మేషన్ డిపార్టుమెంటుకి చెందిన అటెండరు రంగనాయకులు. నిజానికా డ్యూటీ అతనిది కాదు. కానీ పనులన్నీ అతనిమీదవేసి అతనిపై అధికారులంతా మంత్రిగార్ని ఆహ్వానించడానికి ఊరు చివరకు వెళ్ళారు.

టైము గడిచిపోతున్నకొద్దీ నిలబడిన జనంలో ఉత్సుకత పెరిగిపోతున్నది.

సినిమాపాట చెవులు గింగిర్లెత్తిస్తున్నది.

'గు గ్గు గ్గు గ్గు....గుడిసుంది! మ మ మ మ....మంచముంది....'

బూతు స్పీకర్లోంచి విషవాయువులా చుట్టూ వ్యాపిస్తున్నది -

ఇంతలో -

మంత్రిగా రొచ్చేశారన్న వార్త విన్పించింది.

హడావిడి... సంచలనం..ఉరుకులు... పరుగులు. జనంలో తొక్కిసలాట ఎక్కువైంది. ఒకర్నొకరు త్రోసుకుంటూ ముందుకి రావడానికి తీవ్రంగా ప్రయత్నించసాగారు.

చిన్న చప్పుడుతో నాలుగుకార్లు ఒకదానివెనుక ఒకటొచ్చి స్టేజికి పక్కగా ఆగాయ్. దానివెనుక యింకా కొన్నికార్లు,

జీపులు, పోలీసువ్యాన్లు దోవపొడుగునా నిలిచాయి.

మంత్రిగారు కారు దిగారు -

లౌడ్‌స్పీకర్లో పాట మారిపోయింది.

'చిలకకొట్టుడుకొడితే చిన్నదానా....' దిక్కులు దద్దరిల్లిపోతున్నాయి.

ఆ వూరు మహిళామండలి అధ్యక్షురాలు సాంప్రదాయసిద్ధంగా మంత్రిగారికి ఎదురొచ్చి బొట్టుపెట్టి హారతి యిచ్చింది. పురప్రముఖులు, హితులు, శ్రేయోభిలాషులు ఆయన్ని చుట్టుముట్టి కుశల ప్రశ్నలు వేసారు. మంత్రిగారికి గాంధీ విగ్రహాన్ని చూపించి అటువైపు తీసుకుపోయారు. ఈ లోపల రంగనాయకులు మరో రికార్డు వేశాడు -

'సీమనుంచి వొచ్చావూ ... చిట్టిగారెతింటావా. '

పాట ఒక వైపూ, జన సమూహపు కేరింతలు మరొకవైపూ వినిపిస్తుండగా మంత్రిగారు నిచ్చెనమీదుగా అమర్చిన స్టాండుపైన అడుగుమోపారు.

అధికారు, అనధికారులు- అంతులేని ప్రజాసమూహం తలెత్తి చూస్తుండగా ఆయన గాంధీగారిమీదున్న తెల్లని గుడ్డను తొలిగించారు.

బోసినవ్వుతో గాంధీగారు ప్రజలకి దర్శనమిచ్చారు. మంత్రిగారు దండొకటి ఆయన మెడలో అలంకరించారు.

కెమేరాలు క్లిక్కుమన్నాయి.

రంగనాయకులు ఒక్కో రికార్డు మార్చాడు-

'ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరి- కొకెత్తు కెళ్ళింది కొండగాలీ...!'

మంత్రిగారి మొహం ముడుచుకుంది. సెక్రటరీని పిల్చి అతని చెవిలో యేదో చెప్పాడు. క్షణాలమీద ఆ మాట చెవులు మారింది. దరిమిలా అందరికీ అప్పుడు గుర్తొచ్చింది. కార్యనిర్వాహకులంతా తలలు బాదుకున్నారు. తమ తొందరపాటుకీ, మతిమరుపుకీ తలబాదుకున్నారు.


ఫలితంగా- లౌడ్‌స్పీకర్ గొంతు నొక్కబడింది. రంగనాయకులు తన ఆఫీసరుచేత తలవాచిపోయే తిట్లుతిన్నాడు.

"నా కెవరూ చెప్పలేదు సార్!- లోపలున్నాను కదా-మంత్రిగారు రావటం నేను అసలు చూడలేదు-" అన్నాడతను భయంగా.

"ఏడిశావ్‌లే నోర్ముయ్!-" అన్నాడు అఫీసరు.

ఆ తర్వాత కార్యక్రమాలన్నీ చకచకా నడిచాయి. పెద్దలంతా వేదిక అలంకరించారు. తమ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మంత్రి కావడంపట్ల పురప్రముఖులంతా మంత్రిగార్ని అభినందిస్తూ ప్రసంగించారు.....

చివరగా మంత్రిగారు గాంధీ మహాత్ముని విగ్రహప్రతిష్ఠ తన చేతుల మీదుగా జరిపించినందుకు ప్రజలకి కృతజ్ఞతలు చెప్పాడు. దేశం నలు




మూలలా గాంధీగారి విగ్రహాలు స్థాపించాల్సిన ఆవశ్యకతను గూర్చి చెప్తూ గాంధీగారు దేశానికి చేసిన సేవలు గురించి కూడా ప్రస్తావించాడు.

ఆయన ఉపన్యాసానంతరం సమావేశం ముగిసింది. వొచ్చిన పెద్దలు వేదిక దిగి తమతమ వాహనాలకేసి నడిచారు. వాహనాలు కలి గెస్టుహౌస్ కేసి సాగిపోయాయి.

ఆ తర్వాత మళ్లీ లౌడ్ స్పీకరు ప్రాణం పోసుకుంది. దిక్కులు దద్దరిల్ల చేయసాగాయి సినిమా పాటలు

అటెండరు రంగనాయకులు రికార్డులు వేయటంలో మునిగాడు.

* * *

ఇన్ ఫర్ మేషన్ ఆఫీసు_

ఆఫీసరు విఘ్నేశ్వర్రావు బజర్ నొక్కి రంగనాయకుల్ని పిలిచాడు.

— "వెళ్ళి సూపర్ వైజర్ కృష్ణ మూర్తిని పిల్చుకురా" ఆర్డర్ వేసాడు.

మరో రెండు నిముషాల్లో కృష్ణమూర్తి వొచ్చి ఆఫీసరు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. విఘ్నేశ్వర్రావు మొహం సీరియస్ గా వుండటం చూసి షాక్కు మన్నాడతను. ఏదో కాగితంలోకి సీరియస్ గా చూస్తున్న విఘ్నేశ్వర్రావు భారంగా ఊపిరొదిలి పెదవి కొరుక్కుంటూ కాగితాన్ని కృష్ణమూర్తి ముందుకు నెట్టాడు.

"ఇదేమిటో చదువు మిస్టర్ కృష్ణ మూర్తీ_"

కృష్ణమూర్తి మారుమాట్లాడకుండా ఆ

కాగితాన్ని చదివాడు. అతని మొహం పాలిపోయింది. "సార్!" అన్నాడు కంగారుగా.

"యస్ మిస్టర్! ఆ రోజు మంత్రిగారొచ్చినప్పుడు మన డిపార్ట్‌మెంట్ తరపున ఇన్‌ఛార్జ్ నువ్వేగా?"

"అవును సార్....!" చిన్నగా అన్నాడు కృష్ణమూర్తి.

"దీనికి నీ సంజాయిషీ ఏమిటి...?"

ఆఫీసరలా గద్దించటం చూస్తుంటే చిరాకేసింది కృష్ణమూర్తికి. జరిగిందానికి తనొక్కడే బాధ్యుడన్నట్లుగా మాట్లాడతాదేమిటీయన....? సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం ఆయనకి లేదా..." మంత్రిగా రొచ్చినప్పుడు సమయం సందర్భం చూసుకోకుండా బూతు సినిమా పాటలు వేసినందుకు ఆయనకి కోపమొచ్చింది. దరిమిలా అందుకు కారకులైనవారిమీద వెంటనే చర్య తీసుకోవాలనీ అవసరమైతే సస్పెండ్ చేసెయ్యమనీ ఆర్డర్స్ జారీచేసారు

"వాట్ కృష్ణమూర్తీ! మీకు బూతు పాటలంటే ఇష్టమా....?" ఆఫీసరు వ్యంగ్యంగా ప్రశ్నించాడు.

కృష్ణమూర్తికి తీక్షణంగా జవాబు చెప్పాలన్పించింది కానీ తమాయించుకొని– "అదేంలేదు సార్!" అన్నాడు.

"మరైతే ఆ రోజు ఎందుకలా జరిగింది....? ఒకవైపు మహాత్మాగాంధీగారి విగ్రహప్రతిష్ఠ; మరొకపక్క వొచ్చింది మంత్రిగారు – మనది ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచే సమాచారశాఖ. అదేం పెళ్ళి పంక్షన్ కాదుగా? సినిమాపాటలు వేయడానికి–దేశభక్తిపాటలు వెయ్యాల్సింది. అవి కాకపోతే కనీసం దైవభక్తితో కూడు కొన్నవైనా విన్పించాల్సింది–"

కృష్ణమూర్తి మౌనంగా వింటూ చూపుడువేలుతో టేబుల్‌మీద పిచ్చిగీతలు గీయసాగాడు.

"నౌ యువార్ సస్పెండెడ్ మిస్టర్ కృష్ణమూర్తీ" విఘ్నేశ్వర్రావు కటువుగా అన్నాడు.

"సార్....!" విభ్రాంతితో చూశాడు కృష్ణమూర్తి.


"యస్! ఐ కాంట్ హెల్ప్ - యూ కెన్ గో –"

"నో సార్....! నేను సస్పెండ్ కావడానికి వీల్లేదు. ఆ మాటకొస్తే దీనికి నేను నామమాత్రపు బాధ్యుణ్ణి. ఇందుకు పూర్తికారకుడు మన ఆపరేటర్ వెంకటయ్య. పిలిచి అతన్ని సస్పెండ్ చెయ్యండి–" అన్నాడు బిగ్గరగా.

"దెన్ కాల్ హిమ్" ఆఫీసరు ఆర్డర్ వేయటంతో మరో నిముషంలో వెంకటయ్య ఛాంబర్‌లోకొచ్చి నిలబడ్డాడు.

"ఎందుకు సార్ పిలిచారు?"

"గతవారం మంత్రిగా రొచ్చినప్పుడు సందర్భాన్ని గమనించకుండా నువ్ బూతు సినిమాపాటలు వేసినందుకు




నిన్ను సస్పెండ్ చెయ్యమని ఆర్డర్స్ వొచ్చాయి. యూ వార్ సస్పెండెడ్_"

వెంకటయ్య బిత్తరపోయాడీమాటకు. క్షణంలో తేరుకుని అన్నాడు - "దానికి నన్నేం చెయ్యమంటారు సార్....!"

"ఆ సమయంలో దేశభక్తి పాటలు విన్పించాలని నీకు తెలియదోయ్!" అన్నాడు కృష్ణమూర్తి తను కల్పించుకొంటూ.

"తెలుసు సార్....కానీ...."

"కానీ లేదు అర్ధణా లేదు. నిన్ను సస్పెండ్ చేస్తున్నాను. నువ్వింక వెళ్ళొచ్చు_" కఠినంగా అంటూ విఘ్నేశ్వరావు ఫైళ్ళలో తలకాయ దూర్చేడు.

వెంకటయ్య నిస్సహాయంగా కృష్ణమూర్తికేసి చూశాడు.

"అయామ్ సారీ! నేనేం చెయ్యలేను_" అంటూ వెళ్ళిపోవడానికి లేవబోయాడతను.

ఆగ్రహంతో కళ్ళెర్రబడ్డాయి వెంకటయ్యకి. వాళ్ళ మాటలూ, వైఖరీ అతనికి అసహ్యం కల్గించాయి.

"ఆగండి సార్...!" అని అరిచాడు బిగ్గరగా.

విఘ్నేశ్వరావూ, కృష్ణమూర్తీ ఈ అరుపుకి ఉలిక్కిపడి చూశారు. లేవబోతున్న కృష్ణమూర్తి అలాగే కూలబడిపోయాడు.

—"మీరేం చెయ్యలేరూ...? అవును సార్లూ మీరేం చెయ్యలేరు అడిగేవాడు లేకుంటే మీ రెంతపనైనా చెయ్యగలరు. ఆ దినం ఫంక్షన్‌కి విన్పించడానికి అసలు మన ఆఫీసులో రికార్డు లేవి....? ఉన్నాయా? ఎప్పటికప్పుడు వాటికోసం వొచ్చిన గ్రాంట్స్ అన్నీ మీ రిద్దరే మ్రింగి కూర్చుంటిరి. మెలానే ఆ మంత్రిగారు కూడా. ఆ రోజు ఏ రికార్డ్ విన్పిస్తే ఏం పోయిందట...? తన గొప్పతనం

ప్రజలకి చూపించాలన్న రాజకీయ తంత్రం కాకపోతే ఈ చిన్నదానికి సస్పెండ్ చెయ్యాలా? అసలు ఇందులో నా తప్పు ఏముంది? నేనేం చెయ్యాలి? గత్యంతరంలేక ఆ దినం ఎప్పట్లాగే రికార్డ్సు బయటినుంచి అద్దెకి తెప్పించి వేసాను. కాబట్టి సార్లూ....! నన్ను సస్పెండ్‌చేస్తే ఇవన్నీ నేను వివరంగా పైకి రిపోర్టుచేస్తాను. అప్పుడు అసలు కారణాలు పైవారికి తెలుస్తాయి. ఏమంటారు....?"

దిమ్మదిరిగిపోయింది అధికారులకి. వెంకటయ్యమాటలకి తేలుకుట్టినదొంగల్లా గమ్మున ఉండిపోయారువిఘ్నేశ్వర్రావూ, కృష్ణమూర్తీ.

"మరిప్పుడీ గండం గడిచే దెట్లాగోయ్?" అన్నాడు కొద్దిసేపటికి విఘ్నేశ్వర్రావు శాంతంగా.

"అదేదో మీరే చూస్కోండి - నే వెళ్తున్నా" అనేసి మరోమాటకి అవకాశ మీయకుండా వెళ్ళిపోయాడు వెంకటయ్య.

విఘ్నేశ్వర్రావు కేం పాలుపోలేదు. జరిగిన పొరపాటుకి అసలు కారకులు నిజానికి తామే కానీ ఇప్పు డెలా....? తన పీకలకి చుట్టుకునేలావుంది. ఎవ్వర్నీ సస్పెండ్ చెయ్యకుండా పై అధికారులకి తానేమని సంజాయిషీ ఇవ్వగలడు. ??

చాలాసేపు గదిలో కూర్చుని చెవులు కొరుక్కున్నారు ఆఫీసరు విఘ్నేశ్వర్రావూ, సూపర్‌వైజర్ కృష్ణమూర్తీ.

* * *

ఆ మర్నాడు -

ఉదయం న్యూస్‌పేపరు తిరగేస్తున్న వారిని ఒకవార్త ఆకట్టుకొంది. ముఖ్యంగా స్థానిక ప్రజల్ని ఆ వార్త బాగా ఆకర్షించింది.

గతవారం మహాత్మాగాంధీ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా అక్కడికి విచ్చేసిన మంత్రిగారి కార్యక్రమంలో అసందర్భంగా బూతు సినిమాపాటలు వేసి అటు పూజ్య గాంధీగారిని; ఇటు గౌరవనీయ మంత్రిగారినీ అవమానపర్చి, అందుకు కారకుడైన స్థానిక సమాచార శాఖలోని అటెండర్ రంగనాయకుల్ని సస్పెండ్ చేస్తూ ఉత్తరువులు ఇవ్వబడ్డాయి -

ఈ వార్త చదివినవాళ్ళు ఒకవక్క మంత్రిగారి సునిశితబుద్ధినీ పరిపాలనా దక్షతనూ అభినందిస్తే - మరోవక్క అంత చిన్న కారణానికి సస్పెండ్ చెయ్యటం ఏమీబాగాలేదని విమర్శించారు.

కానీ -

మూలిగేనక్కమీద తాటికాయ పడినట్లు లబోదిబో మన్నాడు అటెండరు రంగనాయకులు.